## క్లుప్తంగా

### ఘనంగా మేరీమాత జయంతి



మేరీమాతను ఊరేగిస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: క్రైస్తవుల ఆరాధ్య దైవమైన మేరీమాత జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. స్థానిక ఆర్‌సీఎం చర్చి ఆవరణలోని ఆరోగ్యమాత పుణ్యక్షేత్రంలో ఉదయం నుంచి తెలుగు, తమిళం, ఆంగ్లం ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. కర్నూలు డయాసిస్ సెక్రటరీ రెవరెండ్ ఎ.చౌరప్ప హాజరై భక్తాదులకు సందేశాన్నిచ్చారు. చర్చి పాస్టర్లు రెవరెండ్ ప్రతాప్‌రెడ్డి, రవి ప్రార్థనలు నిర్వహించి భక్తాదులను ఆశీర్వాదించారు. సాయంత్రం మేరీమాతను విశేష పుష్పాలతో అందంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. ఆంధ్రా, కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు నుంచి భక్తాదులు వందలాది సంఖ్యలో హాజరై ప్రార్థనలు నిర్వహించారు. గత నెల 29 నుంచి ప్రారంభమైన నవదిన ప్రార్థనలు ముగిసాయి.

### ఉపాధ్యాయినికి సన్మానం



రాధికను సన్మానిస్తున్న దృశ్యం

గుత్తి: స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయిని రాధిక ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయినిగా మంత్రి బొత్సా సత్యనారాయణ ద్వారా అవార్డు పొందడంతో శుక్రవారం తోటి ఉపాధ్యాయులు ఆమెను ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా రాధిక సేవలను వక్తలు కొనియాడారు. హెచ్‌ఎం ఉషారాణి , ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### సామూహిక వరలక్ష్మీ వత్రం



వ్రతం ఆచరిస్తున్న మహిళలు

గుంతకల్లు: కసాపురం నెట్టికంటి ఆంజనేస్వామి దేవస్థానంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఉత్సవ విగ్రహాన్ని కొలువుదీర్చి వేదపండితులు, అర్చకుల ఆధ్వర్యంలో మహిళలు వ్రతం ఆచరించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ డీ.వెంకటేశ్వర్లు, ఏఈఓ ధనుంజయ్య తదితరులు పాల్గొన్నారు.

### టేక్ హోం రేషన్ పంపిణీ



టేక్ హోమ్ రేషన్ అందిస్తున్న దృశ్యం

తాడిపత్రి అర్బన్: స్థానిక భగత్‌సింగ్ నగర్ లోని(30 వార్డు) అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు, వార్డు కన్వీనర్ మనోజ్ శుక్రవారం టేక్ హోం రేషన్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాతశిశు సంక్షేమం అనేక కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. ఇందులో భాగంగా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నారన్నారు. టేక్ హోం రేషన్ కింద బియ్యం, గుడ్లు, నూనెతో పాటు పప్పులు, ఇతర పౌష్టికాహారం అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### ముందు జాగ్రత్తలతో పత్తిలో అధిక దిగుబడి

నార్పల: పత్తి సాగు చేసిన రైతన్నలు ముందు జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుబడి పొందొచ్చని రేకులకుంట వ్యవసాయ పరిశోదన శాస్త్రవేత్త రాధిక పేర్కొన్నారు. శుక్రవారం ఆమె నడిమిదొడ్డి గ్రామంలో పత్తి పొలాలను పరిశీలించారు. పంటకు ఆశించే గులాబీ రంగు, కాయ తొలుచుపురుగు, వైరస్ నివారణ చర్యలను ఆమె రైతులకు వివరించారు. ఏఓ చిన్న వీరస్వామి ఉన్నారు.

### జనావాసంలో మయూరం



సుంకేసులపల్లిలోని ఓ ఇంటిపై ఆకలి తీర్చుకుంటున్న మయూరం

పెద్దపప్పూరు: సుంకేసులపల్లిలో శుక్రవారం జనావాసంలో మయూరం కనువిందుచేసింది. గ్రామస్తులు ఎంతో ఆసక్తిగా తిలకించి మయూరానికొ పప్పులు, వేరుశనగ విత్తనాలను తమ ఆవాసాలపై చల్లడంతో ఎంచక్కా వచ్చి వాటిని తినివేసి ఆకలి తీర్చుకుంది. పెండేకల్లు ప్రాజెక్టు సమీపంలో ఎక్కువగా మయూరాలు ఉన్నాయని అప్పుడప్పుడు గ్రామంలోకి వస్తుంటాయని గ్రామస్తులు తెలియజేశారు.

# పేదల ముంగిటకే సంక్షేమ పథకాలు

● ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

శింగనమల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి వాగ్ధానాన్ని నెరవేరుస్తూ, ప్రజల ముంగిటకే సంక్షేమ పథకాలు తీసుకొచ్చారని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. శుక్రవారం మండలంలోని సోదనపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, ఏపీ నాటక అకాడమీ చైర్‌పర్సన్ ప్రమీల, సర్పంచ్ బొమ్మన గోపాల్‌రెడ్డితో కలిసి గ్రామంలో ఇంటింటికీ తిరిగి నాలుగేళ్లలో ఆయా కుటుంబాలకు అందించిన లబ్ధిని వివరించారు. స్థానికులతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎస్సీ కాలనీలో సీసీరోడ్లు వేయాలని కోరగా ఎమ్మెల్యే వెంటనే అధికారులను పిలిచి, ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. వీధిదీపాలు వెలగడలేదని తెలపడంతో వాటిని పరిశీలించాలని విద్యుత్ సిబ్బందిని ఆదేశించారు. అవసరమైతే కొత్త లైన్, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని సూచించారు. నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాల ద్వారా పేదలను ఆర్థికంగా బలోపేతం చేయాలని సీఎం జగనన్న సంకల్పించారన్నారు. సంక్షేమ పథకాలను కుల, మత, పార్టీలను చూడకుండా అర్హులందరికీ అందిస్తున్నారని గుర్తు చేశారు. సంక్షేమ ఏదైన కారణం చేత రాకున్నా, అటువంటి వారికి తిరిగి ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి, ఎంపీటీసీ చిన్నబయ్యన్న, నాయకులు చాగంటి సుబ్బారెడ్డి, హేమచంద్రారెడ్డి, గురుమూర్తిరెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, శివారెడ్డి, కర్రి సురేష్, శివయ్య, నాగేంద్ర, చౌవిరెడ్డి, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు సంక్షేమ లబ్ధిని తెలియజేస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

## పొజిషన్ సర్టిఫికెట్ల అందజేత



పొజిషన్ సర్టిఫికెట్లను అందిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద శుక్రవారం చిన్నపొడమలకు చెందిన 12 కుటుంబాల వారికి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పొజిషన్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. ఇళ్లు, స్థలం లేని వారికి వాటిని మంజూరు చేసి ఆదుకుంటున్నారన్నారు. గ్రామంలో తాము కొన్నేళ్లుగా ఇళ్లు కట్టుకుని నివాసముంటున్నా ఎవరూ ఎలాంటి పత్రాలు అందించలేదని, ఎమ్మెల్యే తమ సమస్యను గుర్తించి పొజిషన్ సర్టిఫికెట్ ఇవ్వడం ఆనందంగా ఉందని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో చిన్నపొడమల ఉప సర్పంచ్ పెద్దిరెడ్డి పాల్గొన్నారు.

### కొత్త పింఛన్ల పంపిణీ



పింఛన్ పత్రం అందిస్తున్న సర్పంచు బచ్చలన్న

గార్లదిన్నె: పెనకచెర్లలో శుక్రవారం సర్పంచు బచ్చలన్న లబ్ధిదారులకు నూతన పింఛన్లు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన 14 మందికి ప్రభుత్వం కొత్తగా పింఛన్లు మంజూరు చేసినట్లు సర్పంచు తెలిపారు.

### వృద్ధుడికి తీవ్ర గాయాలు

గుత్తి రూరల్: కొత్తపేట శివారులో గుర్తు తెలియని వాహనం ఢీ కొని మామిళ్లచెరువుకు చెందిన సుంకన్న అనే వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. మామిళ్లచెరువుకు చెందిన సుంకన్న పనిమీద గురువారం అర్ధరాత్రి గుత్తికి వచ్చాడు. పని ముగించుకొని గ్రామానికి వెళ్తూ ఆటో దిగి కొత్తపేటలో రోడ్డు దాటుతుండగా తాడిపత్రి వైపు నుంచి వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో సుంకన్న తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే అతడిని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం పరీక్షించిన వైద్యులు సుంకన్న పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం రెఫర్ చేశారు. ప్రమాదానికి కారణమైన వాహనం కోసం పోలీసులు గాలిస్తున్నారు.

### నేడు విద్యుత్ అంతరాయం

గుంతకల్లు: పట్టణంలోని మార్కెట్‌యార్డు 33/11 కేవీ, ఆదర్శనగర్, పారిశ్రామిక వాడలోని సబ్‌స్టేషన్లు మరమ్మతుల కారణంగా శనివారం గుంతకల్లు టౌన్, రూరల్ పరిధిలో విద్యుత్ అంతరాయం ఉంటుంది. ఈమేరకు ట్రాన్స్‌కో డీఈఈ రంగస్వామి శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

### ఘనంగా కృష్ణాష్టమి



కల్లూరులో శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

గార్లదిన్నె: కల్లూరు, శిరివరంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీకృష్ణుడి విగ్రహానికి శంఖాభిషేకం, పుష్పాభిషేకం తదితర పూజలు చేపట్టారు. అనంతరం డప్పు వాయిద్యాల నడుమ శ్రీకృష్ణుడి విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణలతో అలరించారు.

## జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

తాడిపత్రి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని వైఎస్సార్‌సీపీ యువ నేత కేతిరెడ్డి సాయి ప్రతాప్‌రెడి అన్నారు. శుక్రవారం ఆయన బ్రాహ్మణపల్లిలో ఇంటింటికీ తిరిగి ప్రజలతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్థానికులు పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకురాగా ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న పాలనలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందాయన్నారు. ఎలాంటి సిఫారసులు లేకుండా అర్హత ఉన్న వారి ఇళ్ల వద్దే పథకాలు అందించిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రంగారావు, ఈఓఆర్డీ జిలాన్‌బాషా, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పల్లె నాగేశ్వర్‌రెడ్డి, నాయకులు శివారెడ్డి, పాపిరెడ్డి, శ్యాం సుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న కేతిరెడ్డి సాయి ప్రతాప్‌రెడ్డి

### ముగిసిన మండల స్థాయి క్రీడాపోటీలు

యాడికి: స్థానిక ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల స్థాయి ఆటల పోటీలు(స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) ముగిశాయి. యాడికి, రాయలచెరువు, నగరూరు, కోనుప్పలపాడు, నిట్టూరు ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ విద్యార్థినులకు అండర్–14, అండర్ –17 విభాగాల్లో షటిల్, బ్యాడ్మింటన్, బాల్ బ్యాండ్మింటన్, కబడ్డీ, ఖోఖో, టెన్నికాయిట్, త్రోబాల్, వాలీబాల్, యోగా వంటి క్రీడాంశాల్లో పోటీలు జరిగాయి. మండల స్థాయిలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ఈ నెల 20 లోపల నియోజక వర్గ స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలుంటాయని ఉన్నత పాఠశాల హెచ్‌ఎం విజయమ్మ, పీఈటీలు లోకేశ్వరీ, ఓబుళమ్మ తెలిపారు. కార్యక్రమంలో అయా పాఠశాలల పీఈటీలు పాల్గొన్నారు.

### ఘనంగా పౌష్టికాహార మాసోత్సవం

పామిడి: స్థానిక అంగన్‌వాడీ కేంద్రం–2,3, కాల్వగడ్డ–1,2, ఎస్‌సీ, చైతన్యకాలనీలో శుక్రవారం గుత్తి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానికంగా లభించే ఆకుకూరలు, కూరగాయల్లో పోషక విలువలు అధికంగా ఉంటాయని అంగన్‌వాడీ సిబ్బంది తెలియజేశారు. క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌కే రాధ, అంగన్‌వాడీ కార్యకర్తలు జీఎల్ నారాయణమ్మ, రజియా, జ్యోతి, ప్రేమకుమారి, సుశీల, గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

### బాల్య వివాహాలు అరికడదాం

శింగనమల: బాల్య వివాహాలను అరికడదామని ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బాల్య వివాహ నిరోధక అధికారుల అధికారాలు–విధులపై డివిజనల్ స్థాయి శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జీఓ 31 ప్రకారం గ్రామస్థాయిలో వీఆర్‌ఓ, పంచాయతీ కార్యదర్శి, మహిళ పోలీసులకు బాల్యవివాహాల నిరోధానికి చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ రామలక్ష్మి, సీడీపీఓ ఉమాశంకరమ్మ, ఎంపీడీఓలు నిర్మలాకుమారి , తేజోత్స్న, ఉమాదేవి, డీసీపీఓ సుబ్రహ్మణ్యం, చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ కృష్ణమాచారి, ఎంఈఓలు, తదితరులు పాల్గొన్నారు.

### అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవంపై ర్యాలీ

గుత్తి: పట్టణంలో శుక్రవారం ఆర్డీటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవంపై సీడీసీ సభ్యులు, పేరెంట్స్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక నిజామి షాదీ ఖానా నుంచి గాంధీ సర్కిల్ వరకు ర్యాలీ సాగింది. అనంతరం అక్కడ మానవహారం ఏర్పడి అక్షరాస్యత ఆవశ్యకతపై నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఉషారాణి, ఆర్డీటీ ఏటీఎల్ నారాయణ మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో 70 శాతం, దేశంలో 77 శాతం అక్షరాస్యత ఉందన్నారు. 100 శాతం అక్షరాస్యత సాధించడానికి చర్యలు తీసుకోవలసిన అవసరం, ఆవశ్యకత ఉందన్నారు.

## ‘బాబు పాలనా కాలమంతా కరువుకాటకాలే’

గుత్తి: బాబు పాలనా కాలమంతా కరువుకాటకాలే రాజ్యమేలాయని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లాలో శుక్రవారం వైఎస్సార్ సీపీ సీనియర్ నేత శ్రీనివాసరెడ్డి, పట్టణ, మండల కన్వీనర్లు పీరా, గోవర్ధన్‌రెడ్డి, పట్టణ, మండల సచివాలయ కన్వీనర్లు రంగస్వామి, సుభాష్‌రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మల్లయ్యయాదవ్, మాజీ జెడ్పీటీసీ ప్రవీణ్ కుమార్ యాదవ్ విలేకరులతో మాట్లాడారు. బాబు ష్యూరిటీ– భవిష్యత్ గ్యారెంటీ పేరుతో గురువారం గుత్తిలో జరిగిన సభలో చంద్రబాబు అసత్యాలు వల్లించారన్నారు. రైతులకు, మహిళలకు తన హయాంలో మేలు చేశానని చెప్పారని, ఇది పచ్చి అబద్ధమన్నారు. చంద్రబాబు 14 ఏళ్ల పాలనలో కరువు, కాటకాలేనని, ఒక్క మంచి పథకం ప్రవేశ పెట్టింది లేదన్నారు. సీఎం జగన్, మంత్రులు, ఎమ్మెల్యేలపై నోరు పారేసుకోవడం తప్ప తామేం చేశామో చెప్పుకోలేని దుస్థితిలో చంద్రబాబు, నారా లోకేష్ ఉన్నారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గుంతకల్లులో పాల్‌టెక్నిక్ కళాశాల, బ్లడ్ బ్యాంకు ఏర్పాటు చేశారని, గుత్తి ఆస్పత్రిని 50 పడకలుగా అప్ గ్రేడ్ చేశారని, రూ.173 కోట్లతో మిడ్ పెన్నార్ వాటర్ స్కీంను ప్రారంభించారని గుర్తు చేశారు. గుత్తి సభలో చంద్రబాబు ఓ క్రికెట్ బుకీని వెనుక వేసుకుని ప్రసంగించడం సిగ్గు చేటన్నారు. చంద్రబాబు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, ఆయన సోదరులను విమర్శించడం తగదన్నారు. వైవీఆర్ సోదరులందరూ ప్రజా మద్దతుతో గెలిచిన వారేనన్నారు. లోకేష్ మాదిరి బ్యాక్ డోర్ నుంచి మంత్రి కాలేదన్నారు. చంద్రబాబు అమరావతిలో రూ.118 కోట్లు అక్రమాలకు పాల్పడ్డాడని ఐటీ నోటీసులు పంపితే ఎల్లో మీడియా లో అసలు ఒక అక్షరం కూడా వేయలేదన్నారు. వైఎస్సార్ సీపీ మున్సిపల్ కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

## ముబీనాను ఆదర్శంగా తీసుకోవాలి

శింగనమల: సోదనపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు ముబీనా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డు తీసుకోవడం అభినందనీయమని, ఉపాధ్యాయులు ఈమెను ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఏపీ ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి సూచించారు. శుక్రవారం ఎమ్మెల్యే సోదనపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు. ఉపాధ్యాయురాలు ముబీనా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డు తీసుకోవడంతో ఎమ్మెల్యే దంపతులు ఆమెను శాలువాతో సన్మానించి, అభినందించారు. కార్యక్రమంలో నాటక అకాడమీ చైర్‌పర్సన్ ప్రమీల, ఎంఈఓ శివప్రసాద్, ఎంపీడీఓ నిర్మలాకుమారి, సర్పంచ్ గోపాలురెడ్డి పాల్గొన్నారు.



ముబీనాను సన్మానిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆలూరు సాంబశివారెడ్డి

## ప్రత్యామ్నాయ విత్తనాల పంపిణీ

గార్లదిన్నె: స్థానిక రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం మండల ప్రత్యేక అధికారి శాంతి రైతులకు ప్రత్యామ్నాయ విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు 80 శాతం సబ్సిడీతో ప్రత్యామ్నాయ విత్తనాలు పంపిణీ చేస్తోందన్నారు. ఉలవలు, పెసలు, అలసంద, కొర్ర తదితర పంట సాగు చేసుకోవాలని ఆమె రైతులకు సూచించారు. అంతకు ముందు మండల వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించి ఈ క్రాప్ నమోదుపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఓ సోమశేఖర్, రైతులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలని ఏఓ మల్లీశ్వరి సూచించారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. సూర్య నంది కొర్రలు 30 క్వింటాళ్లు, లైలా జొన్నలు 450 క్వింటాళ్లు ఆర్బీకేల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విత్తనం కావాల్సిన రైతులు ఆర్బీకేలో పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు.



గార్లదిన్నెలో ప్రత్యామ్నాయ విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు

### ఆరోగ్య కేంద్రాల పరిశీలన



ఆసుపత్రి ఆవరణాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ రవి

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని ఆరోగ్య కేంద్రాలను మున్సిపల్ కమిషనర్ జి.రవి శుక్రవారం పరిశీలించారు. ఈనెల 30 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో ఆరోగ్య కేంద్రాల్లో సౌకర్యాలపై ఆరా తీశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ రామలక్ష్మి, సివిల్ సర్జన్లు ఇమాన్యుయేల్, యజ్దాన్, టీపీఆర్వో సతీష్, అర్బన్ డెవలపర్ శ్రీకాంత్ ఉన్నారు.

### ముగ్గురికి గాయాలు



రహదారిపై బోల్తాపడిన బొలెరో వాహనం

గార్లదిన్నె: తిమ్మంపేట సమీపంలో 44వ జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డుప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. అనంతపురం నుంచి గుత్తి వైపు వెళ్తున్న బొలెరో వాహనం తిమ్మంపేట సమీపంలోకి రాగానే అదుపు తప్పి రోడ్డుపై బోల్తా పడింది. వాహనంలో ఉన్న కర్నూలు జిల్లా చిప్పగిరికి చెందిన హరీష్‌కుమార్, రామాంజనేయులుకు రక్తగాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను అనంతపురం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటన స్థలికి చేరుకుని ప్రమాదంపై ఆరా తీశారు.

### దోమల నిర్మూలనతో సీజనల్ వ్యాధుల నివారణ

నార్పల: దోమల నిర్మూలనతో సీజనల్ వ్యాధులను నివారించవచ్చని బి.పప్పూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మహేంద్రనాథ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన దుర్గం గ్రామంలో సర్పంచు రామాంజనేయులు, వైద్య సిబ్బందితో కలిసి డ్రై డే ఫ్రైడే నిర్వహించారు. దోమల నిర్మూలను తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఎంపీహెచ్‌ఓ మల్లికార్జున, పీహెచ్‌ఎన్ విజయమ్మ, మల్లికార్జున, శ్రీరాములు పాల్గొన్నారు.

### రాయలసీమ ద్రోహి చంద్రబాబు

● బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఉదయ్‌కిరణ్



మాట్లాడుతున్న ఉదయ్‌కిరణ్

గుంతకల్లు: మాజీ సీఎం చంద్రబాబు రాయలసీమ ద్రోహి అని బీసీ సంఘం జాతీయ సంఘం జాతీయ అధ్యక్షుడు డి.ఉదయ్‌కిరణ్ విమర్శించారు. శుక్రవారం ఆయన పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. గురువారం గుత్తి బహిరంగసభలో చంద్రబాబు సీఎంను జగన్‌ను దోచుకోంటున్నాడని పదేపదే మాట్లాడడనికి సిగ్గు ఉందా అని ప్రశ్నించారు. చంద్రబాబుకు రూ.118 కోట్లు ముడుపుల రూపంలో అందాయని ఈడీ నోటీసులు ఇచ్చిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఇక గుంతకల్లు ఎమ్మెల్యే వైవీఆర్ గురించి నోటికి వచ్చినట్లు మాట్లాడాడని, ఆయన నిత్యం దానధర్మాలు చేస్తూ పదిమందికి సహాయపడుతుంటాడన్నారు. వైఎస్సార్– వైవీఆర్ క్యాంటిన్ ద్వారా రూ.6కె రుచికరమైన భోజనం, ఉచితంగా రెండు అంబులెన్స్‌ల ద్వారా ప్రజలకు సేవలందిస్తున్నారన్నారు. ప్రభుత్వమే ఇసుకకు ఓ రేటు నిర్ణయించి అమ్ముతుంటే ఎమ్మెల్యే వైవీఆర్ అమ్ముకుంటున్నడని చెప్పడానికి నీకు మనసు ఎలా వచ్చిందని విమర్శించారు. వయస్సు మీద పడి పిచ్చి పిచ్చి మాటలు మాట్లాడుతున్న నీకు ప్రజలు రానున్న ఎన్నికల్లో ఓటు ద్వారా ఇంటికి పంపడం ఖాయమని జోస్యం చెప్పారు.

### 30లోపు పరీక్ష ఫీజు చెల్లించండి

గుంతకల్లుటౌన్: ఇంటర్, ఒకేషనల్ కోర్సుల్లో ఫెయిలైన, మధ్యలో మానేసిన విద్యార్థులు ఈ నెల 30లోగా పరీక్ష ఫీజు చెల్లించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఆర్.సాలాబాయి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్ష ఫీజు చెల్లించిన వారు మార్చిలో పరీక్షలు రాయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

# నేడు ఎంసీహెచ్ విభాగం ప్రారంభం



గుంతకల్లుటౌన్: ప్రారంభానికి సిద్ధమైన ఎంసీహెచ్ విభాగపు భవనం



పామిడి: ప్రారంభానికి ముస్తాబైన పామిడి కమ్యూనిటీ ఆసుపత్రి



గుత్తి: నూతనంగా నిర్మించిన ఓపీ యూనిట్ భవనం

గుంతకల్లుటౌన్: పట్టణంలోని రాయ్ సాహిబ్ మిడతల హంపయ్య ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఆవరణలో నాబార్డు నిధులు రూ.13.35 కోట్లతో నిర్మించిన 50 పడకల (ఎంసీహెచ్)మాతాశిశు సంరక్షణ విభాగం ప్రారంభానికి సిద్ధమైంది. శనివారం ఉదయం ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, కలెక్టర్ గౌతమి భవనాన్ని ప్రారంభించనున్నారు. ఎంసీహెచ్, ఆస్పత్రి మొదటి అంతస్తులో నిర్మించిన అదనపు భవనాల ప్రారంభోత్సవం సందర్భంగా ఆస్పత్రి అధికారులు, సిబ్బంది అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

**నేడు కమ్యూనిటీ ఆస్పత్రి ప్రారంభం**

పామిడి: పట్టణంలో నాబార్డు నిధులు రూ.5.80 కోట్లతో నిర్మించిన కమ్యూనిటీ ఆసుపత్రి ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. రంగురంగులతో ఆసుపత్రి భవనాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆసుపత్రిలో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, పీరియాడ్రిక్, డిజిటల్ ఎక్స్‌రే, బ్లడ్ స్టోరేజ్ వంటి వైద్యసేవలు అందనున్నాయి. కనివినీ ఎరుగని రీతిలో ఆసుపత్రి భవనం నిర్మాణానికి నోచుకోవడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

**భవనాన్ని ప్రారంభించనున్న మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే**

పామిడిలో శనివారం మధ్యాహ్నం నూతన కమ్యూనిటీ ఆసుపత్రి భవనాన్ని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి చేతులమీదుగా ప్రారంభించనున్నారు. కలెక్టర్ ఎం గౌతమి, జిల్లా, మండల ఉన్నతాధికారులు హాజరవుతారని, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ వర్గాలు కోరాయి.

గుత్తి: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో నాడు–నేడు కింద రూ.1.95 కోట్లతో నిర్మించిన నూతన భవనాలను శనివారం గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ప్రారంభించనున్నారు. ఉదయం 11 గంటలకు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు ఆసుపత్రికి రావాలని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు శ్రీనివాసరెడ్డి కోరారు.